# బుద్ధిజీవి

## యమ్.యస్.వర్మ

ఉదయం ఆరు గంటలు.

డాక్టర్ రావుగారు అప్పుడే నిద్రలేచి బెడ్ కాఫీ సేవిస్తున్నారు. ఆయన భార్య పక్కనే కూర్చొని, తను రాయబోయే నవల గురించి చెబుతుంటే వింటున్నట్టు నటిస్తూ వొక్కో ముక్కా చప్పరిస్తున్నారు.

పత్రిక సీరియల్ కి యే వారం కాపీ ఆ వారం పంపే స్థాయికి చేరుకున్న చెయ్యి తిరిగిన రచయిత్రి ఆమె... 'కాదు, జబ్బ పుష్టిగల రచయిత్రి' అని రావుగారు వువాచిస్తుంటారు అప్పుడప్పుడూ.

రావుగారు వింటున్నారో, వింటున్నట్టు నటిస్తున్నారో తనకనవసరం అన్నట్టు కళ్ళు మూసుకొని చెప్పుకుపోతోందామె.

కాస్సేపటికి యిక భరించలేనట్టుగా రావుగారు పక్కకి తిరిగారు. ఖాళీ కప్పు టీపాయ్ మీద పెట్టి, న్యూస్ పేపరు అందుకున్నారు.

ఎప్పుడూ—హత్యలు, ఆత్మహత్యలు, మానభంగాలు, లాకప్ మరణాలు, వరకట్నపు చావులు తప్ప మరో వార్తకు నోచుకోక చావు పేపరు ఆ రోజు పునర్జన్మ యెత్తినట్టుగా వుంది... పరదేశపు అలంకరణలతో విసిగిపోయిన తెలుగు పడుచు పాతఫేషనులో కొత్తగా ముస్తాబయినట్టుగా కళకళ్ళాడుతోంది, దినపత్రిక.

'ఏవో ఎలక్షన్లొస్తున్నాయి సుమా!' అనుకున్నారు రావుగారు.

పేపరు నిండా ముఖ్యమంత్రిగారి వుద్రేక పూరితమైన వుపన్యాసాలు... పోయిన ఎన్నికల ముందు చూసిన హెడ్డింగులే అన్నీ... కోటలు దాటిన మాటలు... వాగ్దానాలతో వూదరగొట్టిన వాక్యాలు... ముందు పేజీలో తాటాకాయంత అక్షరాలతో బాక్సులుకట్టి మరీ ప్రచురించారు...

రావుగారి భార్య చటుక్కున లేచి నిలబడింది. సర్రున ఆయన చేతిలోని పేపరు గుంజుకుంది... "నా కథ కంటే మీకా పేపరే ముఖ్యమన్న మాట, అంటే, సుత్తి కొడుతున్నానని యిన్ డైరెక్టుగా చెప్పడమేగా మీ వుద్దేశం!" అంటూ పేపర్ని నాలుగు ముక్కలుగా చించి, చుట్టచుట్టి విసురుగా గదిలోంచి బయటికెళ్ళి పోయిందామె. రుసరుసలాడుతూ.

ఆమె కోపం తాటాకు మంటలాంటిదని ఆయనకి తెలుసు. అందుకే చిన్నగా నవ్వుకుంటూ బాత్రూము వైపు కదిలారు రావుగారు.

స్నానం చేస్తుండగా "ఏవండీ... ఏవండీ... వోసారిటు రండి!" హాల్లోంచి భార్యకేకలు వినిపించి ఉలిక్కిపడ్డారు రావుగారు. కళ్ళముందు ఖూనీ జరిగినట్టుగా గావుకేకలేస్తోందామె. అంటే కొంపదీసి భారత్ కి యేవీ కాలేదు గదా!'... తడివంటి మీదే టవల్ చుట్టుకొని గబగబా హాల్లో కొచ్చారాయన. భారత్, రావుగారి పెంపుడు కుక్క.

"ఏవండీ! మన భారత్ కి యేదో అయిందండీ. బిస్కెట్లు ముట్టుకోవడంలేదు..." అంటూ యెదురుగా చేతిలో బిస్కెట్ ప్లేటుతో రావుగారి భార్య... పక్కనే అలక పాన్పుమీద పెళ్ళి కొడుకులా భారత్... దగ్గరగా నిలబడి ఆందోళనగా చూస్తూన్న వంట చేసే నాయరు కుర్రాడు, పని మనిషి ఎర్రెమ్మ...

బిస్కెట్ ప్లేటు దాని నోటి దగ్గర పెడుతుంటే, ప్లేటు వంక వొకసారి దీనంగానూ, అందరివంకా జాలిగానూ చూసి ముఖం పక్కకు తిప్పేసుకుంటోంది. రావుగారు కూడా పెట్టి చూశారు. వుహూ... లాభంలేదు. వొక్క బిస్కెట్టు కూడా ముట్టుకోలేదు.

నాయరు కుర్రాడు వో బిస్కెట్టు కొరికి చూసి, బానే వుందని పించినా యెందుకైనా మంచిదని వేరే ప్యాకెట్ లోవి మార్చి చూశాడు. ఫలితం కనిపించలేదు.

"పరీక్షచేసి చూడండి!" రావుగారి భార్య పూరికే ఆందోళన పడిపోతోంది.

వెంటనే రావుగారు భారత్ ని అన్ని రకాలుగా పరీక్ష చేశారు.

దాని నిరాహార దీక్ష కారణం మాత్రం దొరకలేదు. "శారీరకంగా యేలోపమూ కనిపించటంలేదు" అన్నారు భార్యతో.

"ఆ... వెటర్నరీ డాక్టరయివుండి, మీకే అంతుబట్టలేదంటే..." ఆమె శోకన్నాలు పెట్టడానికి సిద్ధంగా వుంది. కన్నబిడ్డ తన కళ్ళముందే కాలుజారి కాలువలో మునిగిపోతుంటే నిస్సహాయంగా చూస్తున్న తల్లిలా తల్లడిల్లిపోతున్నదామె.

అవును మరి, పేరుకు పెంపుడు కుక్కే అయినా భారత్ అని పేరుపెట్టి, పిల్లల్లేకపోవడంతో దాన్ని కన్నబిడ్డ కంటే ఎక్కువగా ప్రేమిస్తూ సాకుతున్నారు ఆ దంపతులు. అందుకే రావుగారిక్కూడా మనసంతా అదోలా అయింది దాన్ని అలా చూస్తుంటే. రోజూ పొద్దున్నే రెండు ప్యాకెట్ల బిస్కెట్లుయెంతో యిష్టంగా భోంచేసేది. అలాంటిది వాసన కూడా చూడ్డంలేదంటే, దానికేవైందో యెంత ఆలోచించినా అర్థంకాలేదు రావుగార్కి... భార్య ముఖంలో బాధను చూడలేక పోతున్నారు ఆయన ఆమెకు కించిత్ కోపం తెప్పించైనా ఆ బాధనించి మరిపించాలని "కొంపదీసి నువ్వు రాయబోయే నవల గురించి యే పని మనిషికైనా చెబుతుంటే భారత్ వినలేదు గదా, ఖర్మ!" అన్నారు రావుగారు.

"ఏవిటీ! నా రచనల్ని యెగతాళి చెయ్యడమేనా మీ పని!... ఆ మాట కొస్తే భారతే నా మొదటి పాఠకుడు. భారత్ పక్కన లేకుండా వొక్క వాక్యం కూడా నేను రాయను... యెప్పుడైనా యిలా జరిగిందా!" అమాయకంగా చెప్పిందామె.

రావుగారు దొంగ చూపులు చూస్తుంటే, నాయరు కుర్రాడు కిసుక్కున నవ్వివెంటనే భుజమ్మీద తుండు గుడ్డను నోటికడ్డం పెట్టుకున్నాడు... ఎర్రెమ్మ వో అడుగు ముందుకు వేసింది.

"అమ్మగోరూ! మీరేటనుకోనంటే వాటో సిన్న సలాఅండి..."

"ఏవిటే!"

"రోగవేటో అయ్యగారిక్కూడా అంతుసిక్కనేదంటే, కచ్చితంగా యిది గాలి పెటావ వేసండి. అనుమానంనేదండి... వోపాలి మా గుంటడు యిట్టాగే కూడూ, నీళ్ళా ముట్టడంమానేత్తే — మా యీడి సివర భూతాయిద్దుడు మూసి సేతబడి అని సెప్పినాడండి. ఆ పున్నాత్ముడు అంతరం గట్టినాక గాని బిడ్డకి తిండి సయించనేదండి..."

రావుగారి భార్య ముఖంలోకి వెలుగొచ్చింది.

ఎర్రెమ్మ మరు నిముషంలో భూతవైద్యుణ్ణి వెంటబెట్టుకొచ్చింది.

రావుగారికి యిలాంటి వాటి మీద నమ్మకం లేదు గాని 'యే పుట్టలో యే పాముందో' అనే సామెతమీద నమ్మకం వున్న మనిషి పైగా తను డాక్టరై వుండి ట్రబులేవిటో కనిపెట్టలేక పోయావనే కాంప్లెక్సుతో మౌనంగా వుండిపోయారు.

భూతవైద్యుడు, సాంబ్రాణి పొగవేసి వేపమండలతో కుక్క తల మీద రాస్తూ యేవో మంత్రాలు చదివాడు. వొక నల్లకోడిని తెప్పించాడు.

**ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వొక జంతు మనస్తత్వ శాస్త్రవేత్త అమెరికానుంచి రీసెర్చి నిమిత్తం ఇండియాకు వచ్చి ప్రస్తుతం మన రాష్ట్రంలో యీ నగరంలోనే వున్నాడు. ఆయన పేరు 'మిస్టర్ టి.కె.భౌ'. ఇంతవరకు...**

...క్కకి దిగతుడిచి రోడ్డు మీదికి విసిరేశాడు... ...హ్నాం వరకూ వావా గందరగోళం చేసి ఆఖర్న దాన్ని ...లో వొక తాయెత్తు కట్టి యాభై రూపాయలు ...తిగా స్వీకరించి అరగంటలో మామూలుగా ...తుందని చెప్పి వెళ్ళిపోయాడు.


...మరో రెండు గంటల గడిచినా భారత్‌లో యేవీ ...కనిపించలేదు... వర్ధమాన కవిసమ్మేళన సభలో ...కా మిగిలిపోయిన యేకైక ప్రేక్షకుడిలా దిగులుగా ...మూస్తూ అలాగే కూర్చొని వుంది.

...వుగారి దంపతులకియేం చెయ్యడానికీ పాలుపోవ ...దు. మధ్యాహ్నమైనా యింట్లో యెవరూ మంచినీళ్ళు ... ముట్టలేదు. అప్పుడే శవం లేచిన యిల్లులా వుంది.

...తలో రావుగారి కాంపౌండరు హాస్పిటల్ నుంచి వ...డు. విషయం తెలుసుకుని, వెంటనే రావుగారి చెవి ... కొచ్చాడు.

"ఇది చిత్తకార్తె ఋతు సమయం కదా! వాహవేళ ... ప్రకోపమేవో సార్!" రహస్యంగా అనుమానం వెలిబుచ్చాడు.

"అవును సుమా!" అన్న రావుగారి సమాధానాన్ని అర్ధరుగా తీసుకుని, పరుగెత్తుకెళ్ళి వొకమేలు జాతి





ఆడకుక్కని తీసుకొచ్చాడు.

భారత్, కూర్చున్న చోటునుంచి కదల్లేదు సరిగదా, ఆడకుక్క వంక కన్నెత్తి అయినా చూడలేదు.

రావుగారు సోఫాలో కూర్చుని గోళ్ళు కొరుకుతూ (తలబద్దలు కొట్టుకుంటే తనకే నష్టమని) ఆలోచిస్తున్నారు— పావుగంట తర్వాత గోళ్ళు తరిగిపోయి వేళ్ళు కూడా కొరుక్కు తినేస్తారనగా తళుక్కున మెరిసిందొక అయిడియా.

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వొక జంతు మనస్తత్వ శాస్త్రవేత్త అమెరికా నుంచి రీసెర్చి నిమిత్తం ఇండియాకు వచ్చి ప్రస్తుతం మన రాష్ట్రంలో యీ నగరంలోనే వున్నాడు. ఆయన పేరు 'మిస్టర్ టి.కె.బౌ'.

ఇంతవరకూ ఆవిషయం గుర్తురానందుకు తనని తనే తిట్టుకున్నారు రావుగారు.

సరిగ్గా గంట తర్వాత మిస్టర్ భౌ గారు డాక్టర్ రావుగారి యింట్లో అడుగు పెట్టారు; పత్రికా విలేఖర్లు, ప్రెస్ ఫోటోగ్రాఫర్లు వెంటరాగా ...

ఆయన సర్వీసులో యిలాంటి కుక్కల్ని యెన్ని చూశాడో అన్నట్టుగా రోగిని చూడగానే రోగం కక్కువ పట్టేశారు మిస్టర్ భౌ. లోపం కుక్కది కాదని బిస్కెట్ల ప్లేటులోనే వున్నదని చెప్పారాయన ఇంగ్లీషులో.

ప్లేటులో బిస్కెట్లకింద వున్న కాగితాన్ని బయటికి తీసి వుత్తప్లేటులో బిస్కెట్లు కుక్క ముందుకు నెట్టారు భౌగారు. అది గభుక్కున ముందుకురికి బిస్కెట్ల మీద కలబడి ఆవురావురు మంటూ అరనిముషంలో ప్లేటు ఖాళీ చేసేసింది.

కెమెరాలు క్లిక్ క్లిక్ మన్నాయి. విలేఖర్లు ఏదో రాసుకుంటున్నారు. అంతా ఆశ్చర్యంతో చుట్టూ మూగారు.

ఆ కాగితంలోని అక్షరాలే ఆ కుక్క మనస్తాపానికి కారణమని సైకాలజిస్టు గారు ఇంగ్లీషులో చెప్పారు. కాగితాన్ని రావుగారి చేతిలో పెడుతూ... ...

తీరా చూస్తూ—

అది ఆ రోజు న్యూస్ పేపరు మొదటి పేజీలోని వొక పార్టు!... అందులో— వాగ్దానాల పరంపరతో నిండివ ముఖ్యమంత్రిగారి వుపన్యాసం.

క్షణంపాటు రావుగారు సిగ్గుతో తలవంచుకున్నారు; డాక్టరుగా కాకుండా వొక పౌరుడిగా.

*